
సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 28 । జూన్ । 2024



మన్యం.. సోయగం

భారీ వర్షాలు కురుస్తుండటంతో మన్యంలో ప్రకృతి సోయగం పర్యావరణ ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తోంది. జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. 8లో ▸



ప్రాణాలు తీసిన విద్యుదాఘాతం

విద్యుదాఘాతం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఈదరలో తల్లీ కొడుకు, తాడేపల్లిగూడెంలో భార్యాభర్తలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. 8లో ▸



వర్జీనియా ధర పైపైకి

వర్జీనియా పొగాకు ధర రికార్డులను సృష్టిస్తోంది. ప్రస్తుతం కేజీ ధర రూ.369కు చేరుకోవడంతో రైతుల ఆనందానికి అవధులు లేవు. 8లో ▸

న్యూస్‌రీల్

29న జాతీయ లోక్‌అదాలత్



సి.పురుషోత్తమ కుమార్, ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఏలూరు (టూటౌన్): జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు అన్ని రకాల కేసుల పరిష్కారం నిమిత్తం ఈ నెల 29న ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, కొవ్వూరులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో ప్రాంశరీనోటు దావాలు, ఆస్తి దావాలు, తనఖా, మోటారు వాహన ప్రమాద కేసులు, కార్మిక వివాదాల కేసులు, చిట్‌ఫండ్ సంబంధిత, ఆర్‌బీటేషన్ కింద రికవరీ కేసులు, సివిల్/రాజీపడదగిన క్రిమినల్ కేసులు జాతీయ రహదారుల భూసేకరణ వ్యవహారాలు, చెక్‌బౌన్స్, కుటుంబ వివాదాలు, దాంపత్య హక్కుల పునరుద్ధరణ, నిర్వహణ, ఇతర సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవచ్చనని తెలియజేశారు. ఈ కేసుల్లో ఉన్న న్యాయవాదులు, ఇరుపక్షాల వారు, అధికారులు, సంబంధిత శాఖలు, బ్యాంకులు దీనిపై అభ్యర్థించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పైన ఉదహరించిన కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌లోని సౌకర్యాలను ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. ఏలూరులో 9 బెంచీలు, జిల్లాలో ఉన్న అన్ని న్యాయసేవాధికార సంస్థలలో 26 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కోర్టు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఏలూరు, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, భీమవరం, నరసాపురం మండల లీగల్ సర్వీసెస్ కమిటీల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు వారివారి ప్రదేశాల నుంచే హాజరు కావచ్చనన్నారు. మొత్తం సివిల్/ క్రిమినల్ కేసుల్లో గుర్తించబడిన జాబితా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. ఇతర సమాచారం కోసం డీఎల్‌ఎస్‌ఏ ఫోన్ నంబర్ 08812 224555 లేదా వాట్సాప్ నంబర్ 94409 01064లో సంప్రదించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్ కోరారు.

నేడు స్ఫూర్తి అవార్డులు

భీమవరం: జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉండి జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు 'సృజన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఆర్.రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్ఫూర్తి అవార్డులు అందజేస్తామన్నారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 46.20 శాతం ఉత్తీర్ణత

భీమవరం: ఎస్ఎస్‌సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో 46.20 ఉత్తీర్ణత శాతం నమోదైందని డీఈఓ జి.నాగమణి గురువారం చెప్పారు. ఈ పరీక్షలకు 5,861 మంది విద్యార్థులు హాజరు కాగా 2,708 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కొరకు జూలై 1వ తేదీలోగా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక సబ్జెక్ట్ రీకౌంటింగ్‌కు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించాలన్నారు.

రేపు నరసాపురంలో జాబ్ మేళా

భీమవరం: నరసాపురంలోని వైఎన్ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరియర్ సర్వీస్(ఎన్‌సీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో పేటీఎం, యాక్సిస్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, ఎపాక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు 93935 75353 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జిల్లాలో 840.6 మిల్లీమీటర్ల వర్షపాతం

భీమవరం: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. 20 మండలాల పరిధిలో గురువారం 840.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నరసాపురంలో అత్యధికంగా 87 మిల్లీమీటర్లు నమోదు కాగా పెనుమంట్రలో 37.8, పెనుగొండలో 38.2, ఆచంటలో 38, పోడూరు 30.4, మొగల్తూరు 24.6, పాలకొల్లు 72.4, యలమంచిలి 40.2, గణపవరం 46.4, ఆకివీడు 47.4, ఉండి 68.8, పాలకోడేరు 52.2, వీరవాసరం 59.2, భీమవరం 70.4, కాళ్ల 40.2, తాడేపల్లిగూడెం 19.4, పెంటపాడు 17.2, తణుకు 9.4, అత్తిలి 25.2, ఇరగవరం 16.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సాయంపై భరోసా ఏదీ?

- రైతన్నకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న కూటమి హామీ
- తొలివిడత సాయం విడుదలపై స్పష్టత ఇవ్వని కొత్త సర్కారు
- రైతు భరోసాను అన్నదాత సుఖీభవగా పేరు మార్పుతో సరి
- పంట పెట్టుబడి సాయం కోసం అన్నదాతల ఎదురుచూపులు
- నారుమడి నుంచి నాట్ల వరకు ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి
- గతంలో ఏటా మేలోనే తొలివిడతగా రూ.7,500 పెట్టుబడి సాయం
- గత ఐదేళ్లలో జిల్లాలో 1,17,999 మంది రైతులకు రూ.796.49 కోట్ల మేర లబ్ధి
- జిల్లాలో జోరందుకున్న తొలకరి పనులు.. 2.30 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు

ఖరీఫ్ పనులు జోరందుకుంటున్న తరుణంలో పంట పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నారుమడి నుంచి నాట్లు వరకు ఎరకాకు రూ.12వేల వరకు ఖర్చవుతుండగా గతంలో సాగు ప్రారంభానికి ముందే వైఎస్సార్ రైతు భరోసా పేరిట ప్రభుత్వం రైతులకు తొలివిడత పెట్టుబడి సాయం అందించేది. ఈ సీజన్‌లో 50 శాతం మేర నారుమడులు పూర్తయినా కూటమి ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత లేక పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురుచూపులు చూడాల్సి వస్తోంది.



పెంటపాడు మండలంలో నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన పొలాలు

సాక్షి, భీమవరం: జిల్లాలోని 2.30 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పదివేల ఎకరాల్లో నారుమడులు సిద్ధం చేయాల్సి ఉండగా, 5,200 ఎకరాల్లో ఇప్పటికే సిద్ధమయ్యాయి. ముందుగా మాసూళ్లు జరిగిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, తణుకు ప్రాంతంలో ఇప్పటికే నాట్లు మొదలయ్యాయి. పాలకొల్లు, ఉండి, కాళ్ల, ఆకివీడు, యలమంచిలి, నరసాపురం మండలాల్లో పనులు ముమ్మరం చేస్తున్నారు. నవంబర్ చివర్లో వచ్చే తుపాన్ల బారిన పడకుండా వ్యవసాయశాఖ సూచనలు మేరకు జూలై మూడో వారం నాటికి నాట్లు పూర్తయ్యేలా పనులు వేగవంతం చేస్తున్నారు.

పెట్టుబడుల కోసం ఇక్కట్లు

సార్వాలో నారుమడులు సిద్ధం చేసిన నాటి నుంచి నాట్లు వేసే వరకు నెల రోజుల వ్యవధిలో నారుమడికి విత్తనాలు, పంట దమ్ము, పొరలంకలు, నేలను చదును చేసేందుకు, ఎరువులు, నాట్లు వేసేందుకు కూలీ ఖర్చులు తదితర రూపాల్లో రూ.12 వేల వరకు ఖర్చవుతుంది. రబీ సీజన్ ధాన్యం సొమ్ములు అధికశాతం మంది రైతులకు ఇంకా అందలేదు. ఈ పరిస్థితుల్లో తొలకరి సాగు పెట్టుబడుల కోసం అయినకాడికి అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

గతంలో సాగుకు ముందే సాయం

గతంలో పెట్టుబడులు కోసం ఇబ్బంది పడాల్సిన పని లేకుండా సాగు ప్రారంభానికి ముందే వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం రైతులకు సాయం అందించేది. కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సాయం రూ.6 వేలకు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 జతచేసి ఏటా రూ.13,500 మొత్తాన్ని ఖరీఫ్ ఆరంభం, కోతలు, రబీ ఆరంభంలో మూడు విడతలుగా అందించేది. తొలివిడతగా మే నెలలో రూ.7,500 రైతుల ఖాతాలకు జమ చేసేది. తొలకరి పంట పెట్టుబడుల కోసం సన్నచిన్నకారు రైతులకు ఈ సాయం ఎంతో అక్కరకు వచ్చేది. గత ఐదేళ్లలో జిల్లాలోని 1,17,999 మంది రైతులకు గత ప్రభుత్వంలో రూ.796.49 కోట్లు లబ్ధి చేకూరింది.

పేరు మార్పుతో సరి

తాము అధికారంలోకి వస్తే ఏడాదికి రూ.20 వేలు చొప్పున రైతులకు ఆర్థికసాయం అందిస్తామని కూటమి మేనిఫెస్టోలో పేర్కొంది. వైఎస్సార్ రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మారుస్తూ రెండు రోజుల కిందట కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీకి సంబంధించి తొలి విడతగా ఎంత మొత్తం సాయాన్ని ఎప్పుడు విడుదల చేసేది చెప్పలేదు. ప్రస్తుతం తొలకరి పనులు జోరందుకున్న తరుణంలో పెట్టుబడులు పెట్టేందుకు చేతిలో సొమ్ములు లేక రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ తొలి విడతగా రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాలకు జమచేయడం కొంత ఊరటనిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన సూపర్‌సిక్స్‌లో చెప్పినట్టుగా సాయం విడుదలకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తొలకరిలో సాగు పెట్టుబడులు సుమారుగా..

- విత్తనం ప్యాకెట్ రూ.600
- నారుమడి నిమిత్తం ఐదు సెంట్ల స్థలంలో ఆకుమడి దమ్ము, విత్తనాలు చల్లేందుకు, ఎరువుకు రూ.1,000
- నాట్లు నిమిత్తం పొలాన్ని రెండు సార్లు దమ్ము చేసేందుకు రూ.3,000
- పట్టి తోలేందుకు రూ.500
- గట్లు చెక్కేందుకు రెండు కూలీలు (కూలీ రూ.700 చొప్పున) రూ.1,400
- నాట్లు వేసేందుకు బెంగాలీ కూలీలకు రూ.4,000
- బస్తాన్నర యూరియా, ఒక డీఏపీ, 40 కేజీల పొటాష్‌లకు రూ.2,300, చల్లేందుకు కూలీ ఖర్చులు కూలీలు రూ.2,100
- కలుపు మందులు రూ.500, పురుగుమందులు రూ.2,500, కూలీ ఖర్చులకు రూ.2,100
- పంట కోతకు రూ.5,200
- రవాణా, ఆరబెట్టేందుకు రూ.2,000, కూలీలకు రూ.2,100

నేడు విధుల్లోకి కొత్త కలెక్టర్



కలెక్టర్ సి.నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా సి.నాగరాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత నూతన పశ్చిమగోదావరి జిల్లాకు తొలిసారిగా పి.ప్రశాంతి 2022 ఏప్రిల్ నాలుగో తేదీ నుంచి 2024 ఫిబ్రవరి 17 వరకు పనిచేశారు. ఆమె బదిలీ అనంతరం కలెక్టర్‌గా సుమిత్ కుమార్ గాంధీ ఫిబ్రవరి 20వ తేదీ నుంచి కొద్ది నెలల పాటు పనిచేశారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఆయన చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొత్త కలెక్టర్‌గా సి.నాగరాణి నియమితులయ్యారు. నాగరాణి తొలిసారి కలెక్టర్‌గా బాధ్యతలను చేపట్టనున్నారు. ఇంతకు ముందు ఆమె ఐటీడీఏ, గ్రామీణ ఉపాధి హామీ, చేనేత-జౌళి, సాంకేతిక విద్య వంటి శాఖల్లో ఉన్నతాధికారిగా పనిచేశారు. 2011 నుంచి 2014 వరకు ఐటీడీఏ పీవోగా, తరువాత గ్రామీణ ఉపాధి హామీ పథకం డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. చేనేత జౌళి శాఖ సంచాలకురాలిగా 2022 ఆగస్టు వరకు విధుల్లో ఉన్నారు. ప్రస్తుతం సాంకేతిక విద్యా విభాగానికి డైరెక్టర్‌గా కొనసాగుతుండగా పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. గతంలో మాదిరిగానే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఇద్దరు మహిళలు పనిచేయనున్నారు. ఇప్పటికే ఎస్పీగా మహిళ అధికారి డాక్టర్ అజిత వేజెండ్ల పనిచేస్తుండగా, కలెక్టర్‌గా సి.నాగరాణి కూడా శుక్రవారం బాధ్యతలు చేపట్టనుండటంతో జిల్లాలో మరోసారి ఇద్దరు మహిళలు ఉన్నత స్థాయి అధికారిణులుగా ప్రజలకు సేవలు అందించనున్నారు.

పింఛన్ల పంపిణీకి పక్కా ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం (ప్రకాశం చౌక్): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో భాగంగా జూలై 1వ తేదీన పింఛన్ల పంపిణీకి పక్కా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య చెప్పారు. గురువారం వెలగపూడిలోని ఏపీ సచివాలయం సీఎస్ కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎన్టీఆర్ భరోసా పథకం పెన్షన్ల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ విజయవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జూలై 1వ తేదీన పెన్షన్ల పంపిణీ కోసం శనివారం బ్యాంకుల ద్వారా నిధులు విత్ డ్రా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా 50 హౌస్ హోల్డ్‌ల మ్యాపింగ్ చేపటాల్సి ఉందని, శుక్రవారంలోపు వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పెండింగ్ ఉన్న హౌస్ హోల్డ్‌ల మ్యాపింగ్ పూర్తి చేస్తామన్నారు. పెన్షన్ల పంపిణీపై ఎస్పీతో చర్చించామని, పోలీసు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం అవసరమైతే అదనపు సిబ్బందిని నియమిస్తామన్నారు. ఒకటో తేదీ రోజునే పెన్షన్ల పంపిణీ విజయవంతంగా పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఇన్‌చార్జి కలెక్టర్ వివరించారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా అభివృద్ధి అధికారి కేసీహెచ్ అప్పారావు, డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఎల్‌డీఓ ఏవీ అప్పారావు, ఏపీవో టి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

వీఆర్‌గూడెం కేవీకేకు అవార్డుల పంట



కేవీకే తరపున అవార్డు అందుకుంటున్న ప్రధాన శాస్త్రవేత్త ఇ.కరుణశ్రీ



క్షేత్రస్థాయి పర్యటనలో ఇతర రాష్ట్రాల శాస్త్రవేత్తలతో వీఆర్‌గూడెం కేవీకే శాస్త్రవేత్తలు


తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రానికి అవార్డుల పంట పండింది. రాజమండ్రిలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న అటరీ జోనల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన 72 కృషి విజ్ఞాన కేంద్రాలు ఈ ప్రాంతీయ సదస్సులో పాల్గొన్నాయి. వాటి కార్యకలాపాల ఆధారంగా గురువారం ముగింపు సందర్భంగా అవార్డులు ప్రదానం చేశారు. ఉద్యాన వర్సిటీ పరిధిలోని నాలుగు కేవీకేలకు జోనల్ స్థాయిలో తొమ్మిది అవార్డులు లభించాయి. 2023–24 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాల ఆధారంగా ఈ అవార్డులు అందజేశారు. వెంకట్రామన్నగూడెం కేవీకేకు మూడు విభాగాలలో ఈ అవార్డుల వచ్చాయి. ఉత్తమ చేపలు, రొయ్యల సాగు శిక్షణలు, ఉత్తమ ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటు, ఆర్యపథకం అమలుకు గాను అవార్డు వచ్చింది. కేవీకే పందిరిమామిడికి రబ్బరు సాగు, ఉత్తమ శిక్షణ అమలు, నైపుణ్య కార్యక్రమాలకు అవార్డు వచ్చింది. కేవీకే పెరియవరానికి ఉత్తమ పోషణ తోటల ఏర్పాటు, ఉత్తమ ఫొటో విభాగాలలో అవార్డు దక్కింది. కేవీకే ఒనిపెంటకు చిరుధాన్యాల సాగు ప్రోత్సాహం, ఉత్తమ బాక్సు ఫొటో అవార్డు వచ్చింది. అవార్డులను వర్సిటీ విస్తరణ సంచాలకులు, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఇ.కరుణశ్రీ అందుకున్నారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ సాంకేతిక పరిశోధన అను ప్రయోగ సంస్థ, ఉద్యాన వర్సిటీ, రాజమండ్రిలోని కేంద్ర వాణిజ్య పంటల పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రాంతీయ సదస్సులో అటరీ హైదరాబాద్ డైరెక్టర్ షేక్ ఎన్.మీరా చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాథుర్ పాల్గొన్నారు. కడియపులంకలోని నర్సరీలను ఇతర రాష్ట్రాల శాస్త్రవేత్తలతో కలిపి ఇక్కడి శాస్త్రవేత్తలు సందర్శించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.71 కోట్లు

24 రోజుల కాలానికి రాబడి

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో గురువారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ జరిగింది. ఈ లెక్కింపులో స్వామివారికి భారీగా ఆదాయం సమకూరింది. గడచిన 24 రోజులకు గాను నగదు రూపేణా శ్రీవారికి రూ.2,71,10,244 నగదుతో పాటు, కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 276 గ్రాముల బంగారం, 6.837 కేజీల వెండి లభించినట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు చెప్పారు. అలాగే విదేశీ కరెన్సీ 2,096 యూఎస్ఏ డాలర్లు, 135 యునైటెడ్ అరబ్ ఎమిరటీస్ దిరామ్స్, 15 ఇంగ్లాండ్ పౌండ్స్, 1 కువైట్ దినార్, 1/2 ఓమన్ బైసా, 395 యునైటెడ్ అరబ్ ఎమిరటీస్ సెంట్రల్ బ్యాంక్ దిరామ్స్, 53 కత్తర్ రియాల్స్, 5 సౌదీ అరబ్బియన్ రియాల్స్, 17 సింగపూర్ డాలర్స్, 5 బ్యాంక్ ఆఫ్ ఘన, 5 బూటాన్, 100 నేపాల్, 10 ఆస్ట్రేలియా కరెన్సీతో పాటు, మరికొంత గుర్తు తెలియని విదేశీ కరెన్సీ లభించాయన్నారు. అదేవిధంగా లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2 వేలు, రూ.వెయ్యి, రూ.500 నోట్ల రూపంలో రూ.29 వేలు లభించినట్టు తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వీసీ నియామకంపై కసరత్తు



ఉద్యాన విశ్వవిద్యాలయ స్వాగత ద్వారం


తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ప్రస్తుత వైస్ చాన్సలర్ డాక్టర్ తోలేటి జానకీరామ్ నియామక ప్రక్రియ తొలిసారి, రెండోసారి కూడా నిబంధనలకు విరుద్ధమంటూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ఉద్యాన వర్సిటీకి ఇన్‌చార్జి వీసీ ఎవ్వరనే విషయంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. నిబంధనల ప్రకారం రెగ్యులర్ వీసీ నియామక ప్రక్రియ చేపట్టేలోగా ప్రస్తుత కార్యకలాపాలు స్తంభించకుండా అత్యవసరంగా ఇన్‌చార్జిని ప్రభుత్వం నియమించాల్సి ఉంది. వీసీ నియామకానికి ముందుగా ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీని ఏర్పాటు చేయాలి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ డైరెక్టర్, ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు గవర్నమెంట్ ముగ్గురు సభ్యులుగా ఉండి వీసీ నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వాలి. వచ్చిన దరఖాస్తులలో అర్హతలు, యూజీసీ మార్గదర్శకాలు తదితరాలను పరిశీలించి అర్హతల ఆధారంగా మూడు పేర్లను ఎంపిక చేసి గవర్నర్‌కు సిఫారసు చేయాలి. ఈ ముగ్గురిలో ఒక పేరును చాన్సలర్ హోదాలో ఖరారు చేసి ప్రభుత్వానికి పంపిస్తారు. బుధవారం కోర్టు ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో న్యాయస్థానం ఆదేశాలు సైన్స్ కాపీలను గురువారం ప్రభుత్వం పరిశీలించి వీసీ నియామకానికి కసరత్తు ప్రారంభించింది.

బరిలో ఇద్దరు

ఉద్యాన వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా రెండు పేర్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, ప్రభుత్వ హార్టీ, సెరీ కల్చర్ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బాబు పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది.

ప్రారంభమైన ఈ-సెట్ కౌన్సెలింగ్

- 30 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు అవకాశం
- ఆన్‌లైన్‌లోనే విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన
- ధ్రువపత్రాల్లో తప్పులుంటే కౌన్సెలింగ్ కేంద్రాలకు..
- జూలై 1 నుంచి కళాశాలల ఎంపికకు వెబ్ కౌన్సెలింగ్
- తణుకు ఎస్ఎంవీపీ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రం



ఏలూరు (ఆర్ఆర్‌పేట): పాలిటెక్నిక్ విద్యార్హతతో బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇటీవల నిర్వహించిన ఈ-సెట్ ఫలితాలు విడుదల కావడంతో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు గురువారం కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ-సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ నెల 30 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన వారికి ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం జూలై 1వ తేదీన సంబంధిత హెల్ప్‌లైన్ కేంద్రాలకు ఆన్‌లైన్‌లో పంపుతారు. హెల్ప్‌లైన్ కేంద్రాలకు చేరిన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే పరిశీలించి ఆమోదిస్తారు. ధ్రువపత్రాల పరిశీలన అసంపూర్తిగా ఉన్న విద్యార్థులకే హెల్ప్‌లైన్ కేంద్రంలో భౌతికంగా సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం జూలై 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించే వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలల ఎంపికకు ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

కౌన్సెలింగ్ ప్రక్రియ ఇలా..

ఈ-సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపుతో పాటు ఈ-సెట్ హాల్ టికెట్, జనన తేదీ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రాసెసింగ్ ఫీజు రూపంలో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.600 ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలి. ఈ-సెట్‌లో ర్యాంకుల సాధించిన విద్యార్థులు హెల్ప్‌లైన్ కేంద్రాలకు విధిగా వెళ్లాల్సిన అవసరం లేదు. వారు ఈ-సెట్‌కు దరఖాస్తు చేసుకునే సమయంలోనే పదో తరగతి, పాలిటెక్నిక్ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన కారణంగా ఆయా పత్రాలను సాంకేతిక విద్యాశాఖ వెబ్ ఆధారిత విధానంలో పరిశీలన పూర్తి చేయడమే ఇందుకు కారణం. ఈ-సెట్ రిజిస్ట్రేషన్ సమయంలో హాల్‌టికెట్ నంబర్, జనన తేదీ వివరాలు సమర్పించిన విద్యార్థులకు సంబంధించిన ధ్రువపత్రాల వివరాలు కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన విజయవంతంగా పూర్తి అయిందని కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తే ఆయా విద్యార్థులు షెడ్యూల్ ప్రకారం నేరుగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. 'క్యాండిడేట్ ఈజ్ నాట్ ఎలిజిబుల్ ఫర్ ఎక్సర్‌సైజ్ ఆప్షన్' అని వస్తే సంబంధిత ధ్రువపత్రాలతో హెల్ప్‌లైన్ కేంద్రంలో పరిశీలనకు హాజరుకావాల్సి ఉంటుంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పురోగతిలో ఉన్నట్లు స్క్రీన్‌పై కనిపిస్తే విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధంగా ఉండాలి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించిన విద్యార్థులందరికీ అనువుగా ఉండేందుకు గాను తణుకులోని ఎస్ఎంవీపీ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

ఆర్ఆర్ పేట వెంకన్న హుండీ ఆదాయం రూ.9.74 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్ర రావు పేట శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి హుండీ ఆదాయం లెక్కించారు. 90రోజులకుగాను రూ.9,74,795 ఆదాయం లభించినట్లు ఈవో నాగం సన్యాసి రావు తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి గోవింద సేవాసమితి సభ్యులు, హనుమాన్ సేవకులు హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొనగా తం గెళ్ళమూడి గ్రూప్ దేవాలయాల ఈవో మీసాల వెంకటరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తాడేపల్లిగూడెం రూరల్: కృష్ణాయపాలెం గ్రామంలోని కమ్మవారి చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం స్థాని కులు గుర్తించారు. ఈ విషయాన్ని రూరల్ పోలీసులకు తెలియజేయడంతో వారు సంఘ టనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీ శారు. మృతుడు 5.3 అడుగుల ఎత్తు, 35 నుం చి 40 ఏళ్ల వయస్సు కలిగి, చామనఛాయ రం గు, నడుముకి నల్లని మొలతాడు, తాయత్తు, ముక్కుపొడుం రంగు నైట్ ప్యాంట్ తలకు ఉం డి బోర్లా పడి ఉన్నాడు. చెరువు గట్టున నలుపు, ఎరుపు రంగు టీ-షర్ట్ లభించాయి. వీఆర్వో ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి



హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): స్థానిక దొండపాడు పరి వర్తన్ బధిరుల పాఠశాల, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హెలెన్ కెల్లర్ 144వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎన్ఐఎంహెచ్ సికింద్రాబాద్ స్పెషల్ ఎడ్యుకేటర్ అంజిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి, రిటైర్డ్ సహాయ సం చాలకులు వి.ప్రసాదరావు పాల్గొని హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లా డుతూ దివ్యాంగులు వారి లోపాలను చూసి కుంగిపోకుండా హెలెన్ కెల్లర్‌ని ఆదర్శంగా తీ సుకుని జీవితంలో ముందుకు సాగాలన్నారు. ఇండియాలోని మైసూర్‌లో హెలెన్ కెల్లర్ జ్ఞాప కార్థంగా ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్‌ను నిర్మించడం జరిగిం దన్నారు. ఆస్పత్రులు, వీధుల పేర్లు హెలెన్ కెల్లర్ పేరు మీదుగా పెట్టడం జరిగిందని వివ రించారు. సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బం ది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ముంజులూరు సమీపంలోని ఏనుగుతోగు జలపాతం



ముంజులూరు సమీపంలో పచ్చదనం పరచుకున్న అడవి



ఉప్పరిల్ల వద్ద ప్రవహిస్తున్న వాగు

పశ్చిమ మన్యం.. ప్రకృతి సోయగం

పచ్చని అందాలతో పశ్చిమ మన్యం చూపరులను ఆకట్టుకుంటోంది. వేసవి కాలంలో ఆకురాల్చి ఎండిన చెట్లతో కనిపించే అడవి మళ్లీ తొలకరి చినుకు రాగానే చిగురించడం ప్రారంభమవుతుంది. గత కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని అడవితల్లి కొత్త అందాలను సంతరించుకుంది. ముంజులూరు, గడ్డపల్లి, దారావాడ, చిలకలూరు, గుబ్బల మంగమ్మతల్లి గుడి సమీపంలోని అటవీ ప్రాంతాల్లోని ప్రకృతి సోయగం పర్యావరణ ప్రేమికులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. ముఖ్యంగా గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే రహదారి, ముంజులూరు నుంచి గోగుమిల్లి వెళ్లే రహదారిపై పయనిస్తుంటే ఇరువైపులా పచ్చదనం.. ఎత్తయిన చెట్లతో సహజసిద్ధమైన ప్రకృతి సోయగాలను ఆస్వాదించవచ్చు. అంతేకాకుండా ఎత్తయిన కొండలు, మలుపులు తిరిగే రహదారులు, కొండలపై జాలువారుతున్న జలపాతాలు, కొండలను తాకుతూ వెళ్లే మేఘాలతో ఏజెన్సీ ప్రాంతం సుందరవనంలా కనిపిస్తుంది. ముంజులూరు సమీపంలోని ఏనుగుతోగు జలపాతం ప్రస్తుతం పర్యాటకులతో సందడిగా మారింది. అలాగే గుబ్బల మంగమ్మగుడిపై నుంచి జలపాతం ప్రవహిస్తూ అమ్మవారి దర్శనానికి వెళ్లిన వారిని కనువిందు చేస్తుంది.

– బుట్టాయగూడెం




బుట్టాయగూడెం మండలం అలివేరు సమీపంలో కొండలను మేఘాలు తాకుతూ కనువిందు చేస్తున్న దృశ్యం



పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా కన్నారప్పాడు వెళ్లే మార్గం



మంగమ్మతల్లి గుడి పైనుంచి ప్రవహిస్తున్న జలపాతం



పాపికొండల అభయారణ్యంలో జలతారు వాగు

వర్జీనియా ధర పైపైకి

- రూ.369కు చేరుకున్న గరిష్ట ధర
- రూ.350కు చేరువలో సరాసరి ధర
- రైతుల్లో ఆనందం

జంగారెడ్డిగూడెం: వర్జీనియా ధరలకు రెక్కలొ చ్చాయి. రోజురోజుకు ధర పైపైకి వెళుతోంది. కేజీ ఒక్కింటికి రూ.300 దాటితే చరిత్రే అనుకుం టే, ఆ రూ.300 ధరను దాటి గురువారం రూ.369 మార్కును చేరుకోవడం ద్వారా వర్జీ నియా వేలం ప్రక్రియ ఉత్తేజాన్నిస్తోంది. వర్జీనియా ధర తారాజువ్వలా ఎగిసిపడటంతో రైతులు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజులుగా నూతన గరిష్టాలు

గడిచిన మూడు రోజులుగా వర్జీనియాలో నూతన గరిష్టాలు నమోదు అవుతున్నాయి. మం గళవారం రూ.350 మార్కును దాటి రూ.352 నమోదు చేయగా, బుధవారం రూ.363 ధర లభించింది. గురువారం మరింత పెరిగి కేజీ ఒక్కింటికి గరిష్టంగా రూ.369కు చేరుకుంది. ఈ రికార్డు ధర జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం -1లో నమోదైంది. ఇదే సమయంలో క్రమంగా వర్జీనియా సగటు ధర కూడా రూ.350కు చేరువగా వచ్చింది. ధరలు ఇలానే పెరుగుతూ ఉంటే గరిష్ట, కనిష్ట ధరలతో పాటు సరాసరి కూడా నూతన రికార్డులు నమోదు చేయడం ఖాయమని ఇటు రైతులు, అటు అధికారులు పేర్కొంటున్నారు.



వర్జీనియా పొగాకు బేళ్లు

వేలం ఇలా

ఎస్ఎల్ఎస్ ఏరియా పరిధిలో ఉమ్మడి పశ్చిమగో దావరి జిల్లాలో ఉన్న ఐదు వేలం కేంద్రాల్లో గురు వారం 4517 బేళ్లు వేలానికి రాగా, వాటిలో 3861 బేళ్లు అమ్మకాలు జరిగాయి. సరాసరి ధర రూ.348.83 నమోదైంది. జంగారెడ్డిగూడెం -1లో 864 బేళ్లు అమ్మకానికి రాగా, 717 బేళ్లు బయ్యర్లు కొనుగోలు చేశారు. ఇక్కడ గరిష్ట ధర రూ.369 నమోదు కాగా, కనిష్ట ధర రూ.235 వచ్చింది. అలాగే దేవరపల్లి వేలం కేంద్రంలో 838 బేళ్లకు గాను 705 బేళ్లు అమ్మకాలు జరగ్గా, గరిష్ట ధర రూ.368, కనిష్ట ధర రూ.210, జం గారెడ్డిగూడెం వేలం కేంద్రంలో 995 బేళ్లకు గాను 829 బేళ్లు అమ్మకాలు జరగ్గా, గరిష్టం రూ.368, కనిష్టం రూ.235, కొయ్యలగూడెం వేలం కేంద్రం లో 966 బేళ్లకు గాను 860 బేళ్లు అమ్మకాలు జరగ్గా, గరిష్టం రూ. 367, కనిష్టం రూ.235, గోపాలపురం వేలం కేంద్రంలో 854 బేళ్లకు గాను 750 బేళ్లు అమ్మకాలు జరగ్గా, గరిష్టం రూ.367, కనిష్టం రూ.235 లభించింది.

ప్రాణాలు తీసిన విద్యుదాఘాతం

విద్యుదాఘాతం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో విద్యుదాఘాతంతో భార్యాభర్తలు దుర్మరణం చెందగా ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో తల్లీకొడుకులు బలయ్యారు. దీంతో వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



గట్టిం అన్నపూర్ణ, గట్టిం వెంకన్న దంపతులు (ఫైల్)

మరణంలోనూ వీడని బంధం

తాడేపల్లిగూడెం అర్బన్: మరణంలోను నీకు నేను తోడు అంటూ భార్యాభర్తలు ఒకేసారి మృతిచెందిన విషాద ఘటన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూ డెంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంలోని 6వ వార్డులోని గాంధీబొమ్మ సెంటరులో గట్టిం అన్నపూర్ణ (55), గట్టి వెంకన్న (60) భార్యాభర్తలు నివాసం ఉంటున్నారు. వీరికి పట్టణంలోని జగనన్న కాలనీలో స్థలం మంజూరు కావడంతో అక్కడ ఇల్లు నిర్మించుకుని జీవనం సాగి స్తున్నారు. వీరి కుమారుడు గాంధీ బొమ్మ సెంట ర్‌లోని ఇంటిలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం వెంకన్న, అన్నపూర్ణ కుమా రుడి ఇంటికి వచ్చారు. మధ్యాహ్నం సమయంలో మంచినీరు కోసం మోటార్ వేసేందుకు స్విచ్ వేసే సమయంలో అన్నపూర్ణ విద్యుదాఘాతానికి గురయ్యారు. పరుగున వెళ్లి భార్యను రక్షించే క్రమం లో భర్త వెంకన్న కూడా కరెంట్ షాక్‌కు గుర య్యారు. మోటార్‌కు ఉన్న కరెంటు వైరుకు లీకే జీలు ఉండటంతో ఈ ప్రమాదం సంభవించింది. ఉదయం నుంచి వర్షం కురవడంతో ఇంటి పరిసర ప్రాంతాలు వర్షం నీటితో తడిగా ఉన్నాయి. దీంతో కరెంటు షాక్ ఉధృతంగా తగలడంతో భార్యాభ ర్తలు ఇద్దరూ మృతి చెందారు. సమాచారం అందు కున్న పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో సంఘ టనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తల్లిని రక్షించబోయి తనయుడు సైతం...

ఆగిరిపల్లి: ప్రమాదంలో ఉన్న తల్లిని రక్షించేం దుకు వెళ్లి తనయుడు సైతం మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంలోని దళితవాడలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై సురేంద్రకు మార్ తెలిపిన వివరాల ప్రకారం ఈదర గ్రామం లో దొండపాటి నాగరత్నం (62) ఇంటి వద్ద బట్టల తీగపై తడి బట్టలు ఆరవేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘా తానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. అదే సమయంలో ఆమెను కాపాడడానికి ప్రయత్నిం చిన ఆమె పెద్ద కుమారుడు రామదాసు (40) కూడా విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. తల్లీకొ డుకులు మృతి చెందడంతో ఈదరలో విషాదం అలుముకుంది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి మృ తదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఈదరలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన తల్లి నాగరత్నం, కొడుకు రామదాసు

పాఠశాలల నీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలి



గాంధీనగర్ పాఠశాలలో మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న డీఈఓ అబ్రహం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మంచినీటి ట్యాంకులను పరి శుభ్రంగా ఉంచడానికి ఉపా ధ్యాయులు, ప్రధానోపాధ్యా యులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం ఆదేశించారు. గురు వారం ఆయన ఏలూరులోని గాంధీనగర్ నగరపాలక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వాటర్ ట్యాంకును పరిశీలించి ప్రధానో పాధ్యాయునికి సూచనలు చేశారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు బ్లీచిం గ్‌తో శుభ్రం చేయించాలని, విద్యార్థులు అతిసారం బారిన పడకుండా పరి శుభ్రమైన తాగునీరు అందించాలని ఆదేశించారు. తనిఖీల సందర్భంగా పాఠశాలలో 6వ తరగతిలో ఎంతమంది విద్యార్థులు చేరిందీ ఆరా తీశారు. పాఠశాలల పునఃప్రారంభం తరువాత తరగతులకు హాజరుకాని విద్యార్థుల వివరాలను తెలుసుకుని వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి పిల్లలను పాఠశాల లకు పంపేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కోళ్ల వ్యర్థాల వ్యాన్ స్వాధీనం

ఉంగుటూరు: నారాయణపురంలో కోళ్ల వ్యర్థాలతో వెళుతున్న వ్యాన్‌ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం నారా యణపురంలో ఓ యువకుడిని వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అప్పని బాబు అనే యువకుడికి స్వల్పగాయాలు అయ్యాయి. ఈ నేపథ్యంలో ఘట నాస్థలికి చేరుకున్న పోలీసులు వ్యాన్‌ను తనిఖీ చేయగా హైదరాబాద్ నుం చి నిడమర్రు మండలం కోళ్ల వ్యర్థాలు తీసుకువెళుతున్నట్లు గుర్తించారు. దీంతో వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మణికు మార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులకు గాయాలు

ఉండి: ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా తండ్రీ కొడుకులు గాయాలపాల య్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిడమర్రు మండలం మం దలపర్రు గ్రామానికి చెందిన సరిపల్లె వెంకట సత్యనారాయణరాజు అతని కుమారుడు నరేంద్రవర్మతో కలసి టీవీఎస్ ద్విచక్ర వాహనంపై భీమవరం వెళుతున్నారు. కోలమూరు పాతరైస్ మిల్లు వద్దకు రాగానే ముందుగా వెళు తున్న ఆటో ఒక్కసారిగా రైట్‌సైడ్‌కు (పక్కకు) తిప్పడంతో ద్విచక్ర వాహనం ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రీ కొడుకులకు గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం భీమవరం ప్రైవేటు ఆసు పత్రికి తరలించారు. బాధితుడు వెంకట సత్యనారాయణరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యేషయా తెలిపారు.

ఘనంగా మావుళ్లమ్మ జ్యేష్ఠ మాస జాతర

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణం ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారి జ్యేష్ఠ మాస జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ వారి ఆధ్వర్యంలో అర్చక బృం దం ప్రత్యేక పూజులు చేశారు. అనంతరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయలు అమ్మవారి జాతరను ప్రారంభించారు. జాతర మహోత్సవం నిర్వహణకు ఆలయ సహాయ కమీషనర్, కార్యని ర్వహణాధికారి బుద్ద మహాలక్ష్మి నగేష్ దేవ స్థానము నుంచి రూ.రెండు లక్షలను ఎమ్మెల్యే అం జిబాబు చేతుల మీదుగా నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీకి అందజే శారు. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, అసాధుల నృత్యాలు, కళా ప్రదర్శనలు, బాణసం చా కాల్పులతో జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారి జాతరను తిలికించారు.



అమ్మవారి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు



జాతరలో భాగంగా మావుళ్లమ్మ ఆలయంలో ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్సీ వర్గీకరణపై చంద్రబాబు వ్యాఖ్యలు

ఉపసంహరించుకోవాలి



భీమవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

భీమవరం: ఎస్సీ వర్గీకరణపై చేసిన వ్యాఖ్యలను చం ద్రబాబు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహిం చారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్ర మంలో రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ మాట్లాడుతూ అధికారం చేపట్టిన కొద్దిరోజులకే చం ద్రబాబు ప్రభుత్వం మాలలపై విషం చిమ్ముతోందని, ఇది సరికాదని అన్నారు. గతంలో వర్గీకరణపై సుప్రీం కోర్టు కేసు కొట్టేసిందని తెలిపారు. చంద్రబాబు అధి కారంలోకి రావడానికి మాదిగలతోపాటు మాలలు కూడా ఓట్లు వేశారని అన్నారు. వర్గీకరణ వ్యాఖ్యలు ఉపసంహరించుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని పుష్పరాజ్ హెచ్చరించారు. కార్య క్రమంలో నేతల సువర్ణరాజు, నేతల సాల్మన్‌రాజు, పిట్టా వినోద్‌కుమార్, భీమవరం చిరా సాయి, పొడా పాటి యాకోబు, కటితల వందనం పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో మృతుడి వివరాలు సేకరిస్తున్న రైల్వే పోలీసులు

భీమవరం : రైలు నుం చి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడని జీఆర్‌పీ హెడ్ కాని స్టేబుల్ జి.సూరిబాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గురు వారం భీమవరం - ఉండి స్టేషన్ల మధ్య 17015 విశాఖ ఎక్స్ ప్రెస్ రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ జారి పడి మృతి చెందాడు. మృతుడు తెలుపు రం గుపై నీలంరంగు గల చొక్కా, నలుపు రంగు ట్రాక్ ప్యాంటు ధరించి ఉన్నాడని, వయస్సు 20 – 25 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుని వివరాలు తెలిసిన వారు సెల్ 99121 24213, 70939 39777 నంబ ర్‌కు సమాచారం అందించాలని కోరారు.

నేరేడు పండు.. పోషకాలు మెండు

- కాయ నుంచి చెట్టు బెరడు వరకూ ఔషధ గుణాలు
- సర్వరోగ నివారిణిగా ప్రసిద్ధి
- పండ్లకు మార్కెట్‌లో డిమాండ్


మార్కెట్లో విరివిగా అమ్ముడవుతున్న నేరేడు పళ్లు

పెంటపాడు: నేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. తిన డానికి కొంచెం తియ్యగా, వగరుగా ఉన్నా వీటిలో పోషక విలువలు అధికం. రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటు ఔషధ గుణాలు, పోషకాల ఎక్కువగా ఉం డటంతో వీటిని సర్వరోగ నివారిణిగా భావిస్తారు. పిల్లలు నేరుడు పలు ప్రాంతాల్లో జంబూఫలం, జామూన్‌గా పిలుస్తారు. ఈ పండ్లను ఆయుర్వేద శాస్త్రంలో అపర సంజీవనిగా చెబుతారు. ఈ పం డ్లలో విటమిన్ ఎ, సి అధికంగా ఉంటాయి. ఆక్సాలిస్ ఆమ్లం ఒక ప్రత్యేకమైన రుచిని పండుకు అందిస్తుంది. జిల్లా ఇవి ఇక్కువగా పండుతాయి.

హైబ్రిడ్ రకానికి మరింత గిరాకీ

నేరుడులో నాటు పండ్ల కంటే హైబ్రిడ్ రకానికి గిరా కీతోపాటు ధర కూడా ఎక్కువే. నాటు పండ్లు ప్రస్తు తం కేజీ రూ.150నుంచి రూ.170వరకు ఉంటే హైబ్రిడ్ కేజీ రూ.200నుంచిరూ.250వరకూ పలు కుతోంది. మధుమేహం, రక్తహీనత, బీపీ, కిడ్నీ సమస్యలతో పాటు ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు. వీటన్నింటిని నివా రణకు ఆస్పత్రుల చుట్టూ తిరిగుతూ వేలకు వేలు ఫీజులు చెల్లిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అయితే సహజ సిద్ధమైన నేరేడు పండ్లలోని ఔషధ గుణం పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులకు మందు లతో పని లేకుండా మంచి ఫలితాన్ని ఇస్తుంది.

నియోజకవర్గంలో...

పెంటపాడు, గూడెం రూరల్, మండలాల్లో నేరేడు పండ్లు ఎక్కువగా లభిస్తాయి. పండ్లు తాజాగా ఉం డటంతో హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి.

ఉపయోగాలు ఇలా..

- శరీర భాగాల్లో గాయాలైతే నేరేడు ఆకులను కట్టుగా కడితే రక్తం కారకుండా నిలుపుదల చేయవచ్చు.
- నేరేడు చెట్టు ఆకులు విషాన్ని సైతం పీల్చుకొనే గుణాన్ని కలిగి ఉంటాయి.
- పొట్టలోఉండే నులిపురుగులను నేరేడు నివారి స్తుంది. నోటి క్యాన్సర్ నివారణకు నేరేడు పండ్లు ఎంతగానో దోహదపడతాయి.
- మధుమేహ వ్యాధి పీడుతులకు నేరుడు పండు ఒక వరం. గింజలను పొడిచేసుకొని ప్రతి రోజూ వాటిని నీటిలో మరగబెట్టి, వడకట్టి తాగితే శరీ రంలో చక్కెర నిల్వలు అదుపులో ఉంటాయి.
- మూత్రశచయ సమస్యలకు నేరేడు ఓ టానిక్‌లా పనిచేస్తుంది. మూత్రం రాక ఇబ్బంది పడే వారికి ఉపయోగపడుతుంది.
- నోటిపూత, చిగుళ్ల వ్యాధులు, దంత క్షయంతో బాధపడేవారు నేరేడు ఆకుల రసాన్ని ప్రతి రోజూ పుక్కలిస్తే ఉప శమనం కలుగుతుంది.
- నోటి పూత వచ్చినప్పుడు రెండు, మూడు నేరేడు పండ్లను తింటే వెంటనే మంట, బాధ నుంచి విముక్తి కలుగుతుంది.
- అతిసార రోగులకు సైతం ఈ పండ్లు ఔషదంగా పనిచేస్తాయి.
- గర్భిణులు నేరేడు పండ్లను తినకూడదు

ఆరోగ్యానికి మేలు



నేరేడుపండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. నేరేడుపండ్లకు విషాన్ని హరించేశక్తి ఉంది. శస్త్ర చికిత్సలు అందుబబాటులో లేనిరోజుల్లో వైద్యానికి నేరేడు బేరడు, కాయలు, ఆకులను ఎక్కువగా వినియోగించేవారు. మధుమేహం, రక్తహీనత, బీపీతో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఇవి ఔషధంగా పని చేస్తాయి.

– డాక్టర్ పూజిత,
ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి

మానవత అధ్యక్షుడిగా పత్స వెంకటేశ్వరరావు


పత్స వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ మానవత అధ్యక్షుడిగా పత్స వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మానవతా నూతన కార్యవర్గంలో కార్యదర్శిగా యర్రా ఆంజనేయస్వామి, కోశాధికారిగా యెగ్గిన శరత్, ఉపాధ్యక్షుడిగా దువ్వా శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా కురుమేళ్ళ వెంకటాచలం, ఎడ్యూకేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఊడిమూడి శ్రీనివాసరాజు, హెల్త్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కొల్లి రాజశేఖర్, అవేర్నస్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జనపనేని రాజేంద్రకుమార్, ఎమర్జెన్సీ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బండారు సీతారాంలు ఎన్నికయ్యారు. అదే విధంగా అడ్వైజరీ కమిటీలో పాటే నాగేశ్వరరావు, బి.హరి కుమార్, కె.బాలకృష్ణ, సీహెచ్ గురుమూర్తి, తమరాడు చిన్న, ఎస్.కాశి, బంది ధనలక్ష్మి, కాకర్ల నవీన్‌బాబు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. నూతన ప్రమాణ స్వీకారోత్సవం ఈ నెల 30వ తేదీన పట్టణంలోని సుబ్బారావుపేట బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుందని గురువారం జిల్లా కమిటీ సభ్యురాలు గట్టిం సింధు వెల్లడించారు. ప్రస్తుతం పత్స వెంకటేశ్వరరావు లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్‌గాను, తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గాను, సీనియర్ సిటిజన్స్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఉండగా, పలువురు పట్టణ ప్రము ఖులు పత్సను అభినందించారు.

క్లుప్తంగా

అన్నసమారాధన


విశేష అలంకరణలో షిర్డీసాయిబాబా

అత్తిలి: మండలంలోని ఉరదాళ్లపాలెం మెయిన్ రోడ్డు పై ఉన్న షిర్డీసాయి, అయ్యప్ప, శ్రీకనక దుర్గమ్మ, గణపతి, వెంకటేశ్వరస్వామి ఆలయాల 30వ వార్షికోత్సవాలు సందర్భంగా గురవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

డయేరియా పై అప్రమత్తంగా ఉండాలి


రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ

తాడేపల్లిగూడెం రూరల్: డయేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ సూచించారు. డయేరియాపై గురువారం మండలంలోని కొమ్ము గూడెం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శర్మ మాట్లాడుతూ కలుషిత వాతావరణం వల్ల డయేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. నీళ్ల విరోచనాల లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. అనంతరం గ్రామంలోని రక్షిత మంచి నీటి పథకాన్ని పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ తాడేపల్లి బేబి, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై దృష్టి


పాలిలో పాఠశాల వద్ద నీటి నాణ్యత పరీక్ష చేస్తున్న దృశ్యం

అత్తిలి: గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు. పాలి గ్రామంలో గురువారం రక్షిత మంచినీటిని క్లోరినేషన్ చేసి నీటి నాణ్యతను పరీక్షించారు. గ్రామంలో గల పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో రక్షిత నీటికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ ఎం శ్రీనివాసరావు, కార్యదర్శి పి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కుమారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం


డిపో మేనేజరు గిరిధర్‌కుమార్

తణుకు అర్బన్: తణుకు ఆర్టీసీ డిపోలో నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ అన్నారు. తణుకు ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికులు పలు ఫిర్యాదులు, సూచనలు చేసినట్లు చెప్పారు. ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించనున్నట్లు వివరించారు. ముఖ్యంగా రాష్ట్రపతి రోడ్డులోని ప్రభుత్వ ఆస్పత్రి గేటు ముందు బస్సులు నిలుపుదల చేస్తున్నారని దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, కొమరవరం, యర్రాయిచెర్వు, మహలక్ష్మి చెర్వు, అంతెనగుంట, ఇరగవరం మీదుగా పల్లెవెలుగు బస్సు నడపాలని, వెన్నెల స్లీపర్ బస్సును ప్రతిరోజూ తణుకు నుంచి బయలుదేరేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

భీమవరం: వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో 22వ వార్డులోని మున్సిపల్ స్కూల్‌కు హ్యాండ్ మైక్‌సెట్‌ను బహూకరించారు. ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం అధ్యక్షుడు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ ద్వారా పేద విద్యార్థులకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. అనంతరం బీటెక్ విద్యార్థిని ఆకెళ్ల భార్గవికి రూ.25వేలు అందజేశారు. ముందుగా స్కూలు ఆవరణలోని మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలపాటి నారాయణ, కొత్త చంద్రశేఖర్ గుప్తా, సబ్బిశెట్టి శ్రీనివాస్ గణేష్, అనంత గోపాలం, నాగసూరి మురళీమోహన్ రావు, సమయమంతుల నాని,వేముల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రతే వ్యాధులకు అడ్డుకట్ట అని దోమ పెరగకుండాను, దోమ కుట్టకుండాను చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని, దోమ కాటు నుంచి రక్షణ పొందాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక బేబి సెంటర్ సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో 9వ వార్డులో కుటుంబ సర్వే, కీటక జనిత ప్రదేశాల గుర్తించడం, సిబ్బందికి అవగాహన, మలేరియా మాత్సోత్సవాలపై అవగాహన సదస్సు, ర్యాలీలు జరిగాయి. డ్రై డే, ఫ్రై డే అవగాహన కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ దోమలు సమాజానికి ప్రథమ శత్రువులన్నారు. వీటి నియంత్రణ ఎంతో అవసరమని ప్రజలందరూ గుర్తించాలని కోరారు. చలితో కూడిన జ్వరం వస్తే వెను వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు టి.వెంకటలక్ష్మి, ఆశా వర్కర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి, మోదుగ గుంట, టిడ్కో విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకులగుంట, అమృతపురం, మోదుగ గుంట, గొల్లగూడెం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, ఎల్.అగ్రహారం టిడ్కో గృహ సముదాయాలకు, కొండ్రుప్రోలు కేఎన్ఎస్ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినయోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక హౌసింగ్‌బోర్డు 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ రైల్వే ఫీడర్, 11కేవీ పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్, 11కేవీ పీఅండ్‌టీ కాలనీ ఫీడర్, 11కేవీ జెడ్పీ ఫీడర్, 11కేవీ మహాలక్ష్మినగర్ ఫీడర్‌లకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 28 శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఎఫ్‌సీఐ కాలనీ, కోతిబొమ్మసెంటర్, సిపాయిపేట, భూపాల్‌నగర్, స్టేషన్ రోడ్డు, బేబీ సెంటర్, జూబ్లీ రోడ్డు, పీఅండ్‌టీ కాలనీ, మహాలక్ష్మినగర్, సత్యవతినగర్, పాతూరు, మసీద్ సెంటర్, మెయిన్ రోడ్డు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పట్టణ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి


పరిమెళ్ల రైతుభరోసా కేంద్రం వద్ద దర్నా చేస్తున్న రైతులు

పెంటపాడు: రబీ బకాయిలు తక్షణమే చెల్లించి, ఎకరాకు రూ.20 వేలు సార్వాకు సాగు సాయమందించాలని రైతుసంఘ, సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెంటపాడు మండలంలోని పరిమెళ్ల గ్రామంలోని రైతుభరోసా కేంద్రం ఆధ్వర్యంలో రైతుసంఘం, సీఐటీయు ఆధ్వర్యంలో స్థానిక రైతులతో కలసి నిరసన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘ మండల కార్యదర్శి చీర్ల పుల్లారెడ్డి, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు శిరపరపు రంగారావులు మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేయాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అను సంధానం చేయాలని ఆయన కోరారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వీఆరోఏ సతీష్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు, పెనుగంటి దుర్గ, శ్రీను, తాడి సుబ్బయ్య, తాడిప్రసాద్, కవల బాలాజీ, మోఖమాట్ల గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తా


ఏరియా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు

తాడేపల్లిగూడెం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని గురువారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అత్యాధునిక సాంకేతిక టెస్టింగ్ యూనిట్లు ఉన్నాయన్నారు. వీటి ద్వారా నెలకు 22 వేల మందికి 90 రకాల పరీక్షలు చేసే అవకాశం ఉందన్నారు. రాబోయే రోజుల్లో వీటిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పేద ప్రజల ప్రాణాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్పొరేట్ స్థాయిలో వైద్య చికిత్సలు అందిస్తామన్నారు. నర్సాపురం ఎంపీ, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ ద్వారా ఆసుపత్రికి ప్రత్యేక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. వంద పడకల ఆసుపత్రిగా సేవలందిస్తున్న ఈ ఆస్పత్రిని 600 పడకల ఆస్పత్రిగా మారుస్తామని, గూడెంను వైద్యహబ్‌గా మార్చే క్రమంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం.తాతారావు, సూపరింటెండెంటు పి.సూర్యనారాయణమూర్తి, నాయకులు వర్తనపల్లి కాశీ, గురుజు సూరిబాబు, పైబోయిన రఘు, పాలూరి వెంకటేశ్వరరావు, పుల్లా బాబీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విభాగానికి బల్లిపాడు జెడ్పీ హైస్కూల్ ఎంపిక


హెచ్ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎన్‌సీసీ స్టేట్ కల్నల్ ఎస్ ముఖర్జీ

అత్తిలి: పీఎంశ్రీ పాఠశాలలో భాగంగా తమ పాఠశాలలో ఈవిద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీసీ విభాగం ఏర్పాటుకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎన్‌సీసీ స్టేట్ కల్నల్ ఎస్ ముఖర్జీ, కమాండెంట్ ఆఫీసర్ బృందం సందర్శించారు. ఈసందర్భంగా హెచ్ఎం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి 8వ తరగతికి చెందిన 25 మంది విద్యార్థులను ఎంపిక చేసి, వారికి ఎన్‌సీసీ శిక్షణ ఇస్తారన్నారు. ఎన్‌సీసీ–ఏ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు భవిష్యత్‌లో ఎన్నో ప్రయోజనాలు కల్గుతాయని, ఈఅవకాశాన్ని బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల సంస్కృత ఉపాధ్యాయుడు ఎస్ పురుషోత్తం మాట్లాడుతూ మండలంలో బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ శిక్షణకు ఎంపికకావడం విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీ రమేష్, జి శ్రీనివాస్, హర్ష, విజయ్, మాధవ్‌లు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి

తాడేపల్లిగూడెం: ఏరియా ఆస్పత్రిలో పాము కాటు, కుక్క కాటు నివారణకు సంబంధించి వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పగడాల సూర్యనారాయణ తెలిపారు. కుక్క కాటు వ్యాక్సిన్‌లు 360 వ్యాక్సిన్లు, పాము కాటు వ్యాక్సిన్లు 320 వ్యాక్సిన్లు ఉన్నాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వీటిని వినియోగించుకోవాలన్నారు.

నేడు, రేపు తణుకులో నాక్ కమిటీ పరిశీలన

తణుకు టౌన్: ఈనెల 28, 29 తేదీలలో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) కమిటీ తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలను పరిశీలించనున్నట్లు ప్రిన్సిపాల్ కె రామకృష్ణ తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలను సందర్శించి అందులోని వసతులను, విద్యబోధనకు సంబంధించిన వివిధ అంశాలను పరిశీలిస్తారని తెలిపారు.

తణుకులో బంకిం చటర్జీ జయంతి వేడుకలు


తణుకు వెంకట్రాయపురం పాఠశాలలో జాతీయ గేయాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు

తణుకు టౌన్: జాతీయ గేయ రచయిత బంకిం చంద్ర చటర్జీ జయంతి సందర్భంగా తణుకు వెంకట్రాయపురం మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులు జాతీయ గేయాన్ని రాసిన బంకిం చంద్ర చటర్జీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బంకిం చంద్ర చటర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చటర్జీ రాసిన గేయాన్ని విద్యార్థులతో ప్రత్యేకంగా ఆలపించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయిని అమ్మాజీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ


భవిత కేంద్రంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు

పెంటపాడు: పెంటపాడు మండల భవిత కేంద్రంలో గురువారం హెలెన్ కిల్లర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో టీవీ రామకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా సర్వశిక్ష అభియాన్ సమన్వకర్త సుబ్రహ్మణ్యం తదితరులు కిల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులను తప్పక బడికి పంపి, ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు పొందాలన్నారు. దివ్యాంగ విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఐఈడీ ఉపాధ్యాయిని షేక్ మస్తాన్‌బీ, వి. సునీత, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు స్కూలు బ్యాగులు పంపిణీ చేశారు.

మావుళ్లమ్మకు సారె సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మకు జేష్ఠ మాస జాతర సందర్భంగా గురువారం విశాఖ పట్టణానికి చెందిన హేమలత, భక్త బృందం సభ్యులు (30 మంది మహిళలు) సారె సమర్పించారు. గాజులు, పసుపుతో అలంకరించిన పాదాలు వివిధ రకాల పళ్లు, స్వీట్స్ తదితర వాటిని సారెగా సమర్పించారు. అనంతరం లలిత సహస్రనామ పారాయణం, కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా మావుళ్లమ్మకు ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

మబ్బే ముసురేసిందిలే..!


ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో తడిచి ముద్దయిన తణుకు పట్టణం

- తడిచి ముద్దయిన తణుకు పట్టణం
- ప్రారంభమైన తొలకరి పనులు

తణుకు: వరుణుకు తణుకు పట్టణంపై కరుణ చూపిస్తున్నాడు. గత కొద్ది రోజులుగా ఎండ ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ఉపసమనం పొందుతున్నారు. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో తణుకు పట్టణం తడిచి ముద్దయ్యింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతోపాటు వాతావరణం సైతం చల్లబడింది. మరోవైపు మబ్బులతో వాతావరణం ఆహ్లాదంగా మారింది. బుధవారం తణుకు మండలంలో 9.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా గురువారం మాత్రం 45 మిల్లీమీటర్ల వర్షంపాతం నమోదైంది. పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సైతం వర్షం కారణంగా జనజీవనం స్తంభించిపోయింది.


రైతులు సిద్ధం చేసుకుంటున్న నారుమడులు

ప్రారంభమైన తొలకరి పనులు...

తణుకు నియోజకవర్గలో తొలకరి పనులు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ కేంద్రమైన తణుకుతో పాటు ఇరగవరం, అత్తిలి, తణుకు మండలాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే ఆకుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని మొత్తం 45 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఘనంగా హెలెన్ కిల్లర్ జయంతి వేడుకలు


భవిత సెంటర్ హెలెన్ జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు సౌజన్యంతో హెలెన్ కిల్లర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హెలెన్ చిత్రపటానికి సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయ కర్త సీహెచ్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ పీఎంవీకే జ్యోతిలు పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. వక్తలు మాట్లాడుతూ కిల్లర్ పుట్టుకతో చెవిటి మూగ, అంధత్వంతో జన్మించి వైకల్యం అధిగమించి వాసన, స్పర్శ ద్వారా విద్యను అభ్యసించిందని, ఆమె జీవిత విశేషాలను విద్యార్థులకు వెల్లడించారు. డైమండ్స్ సేవలను కొనియాడారు. దివ్యాంగుల పిల్లలను తల్లిదండ్రులు తప్పక శిక్షణ అందించాలని కోరారు. భవిత కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక విద్యతో పాటు ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని, ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి సతీష్, కె.సాయి సత్యనారాయణ రాజు, ఆంజనేయ స్వామి, పల్లెల శేషగిరి, హెచ్ఎం జ్యోతి, ఎం .చంద్రకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు


అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.సుజాత

ఆకివీడు: విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికెళ్లకూడదని ప్రిన్సిపాల్ కె.సుజాత పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడపలో వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్ని లక్ష్యంగా చేసుకొని హెరాయిన్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగానికి వారిని అలవాటే చేస్తున్నారని అటువంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు మీ చెంతనుంటే మీ ఆరోగ్యం భుగ్గిపాలవుతుందన్నారు. మీ జీవితం , మీ కుటుంబం నడి రోడ్డున పడుతుందని హెచ్చరించారు. కఠినమైన చట్టాలకు లోనుకావద్దని ఆమె హెచ్చరించారు. కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా వచ్చిన ఎస్‌బీయూ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కె.కాత్యాయిని మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి మంచి అలవాట్లతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఎక్సైజ్ ఎస్ఐ యుగంధర్, ఉభయ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు బకాయిలు తక్షణమే చెల్లించాలి



తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

భీమవరం: రబీ బకాయిలు తక్షణమే చెల్లించి, ఎకరాకు రూ.20 వేలు సార్వాకు సాగు సాయమందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. రైతాంగం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో రైతులు గురువారం భీమవరం తహసీల్దార్ శివకుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేయాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అను సంధానం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవీ ఆనంద్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీపతి, తిరుమాని కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.